తాగునీటి పైప్‌లైన్ మంజూరు చేయండి

- శివార్లలో యూజీడీ పనులకు రూ.40 కోట్లు ఇవ్వండి
- జలమండలి ఎండీకి ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి వినతి


జలమండలి ఎండీ సుదర్శన్‌రెడ్డితో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ఎల్‌బీనగర్: శివారులోని ప్రతి కాలనీలో తాగునీటి, డ్రైనేజీ కల్పనకు చర్యలు తీసుకుంటున్నామని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. జలమండలి ఎండీ సుదర్శన్‌రెడ్డిని శనివారం సుధీర్‌రెడ్డి జలమండలి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గంలోని పలు సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ, గతంలో నియోజకవర్గంలో 80 కిలో మీటర్ల తాగునీటి పైప్‌లైన్ మంజూరైందని, దానికి అదనంగా మరో 18 కిలో మీటర్లు మంజూరు చేయాలని కోరారు. శివారు ప్రాంతాలలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ కోసం రూ.40 కోట్లు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. సానుకూలంగా స్పందించిన జలమండలి ఎండీ పైప్‌లైన్ పనులకు నిధుల మంజూరు చేస్తానని హామీ ఇచ్చారని ఎమ్మెల్యే తెలిపారు.

హైకోర్టు భవనానికి మరోచోట భూమి లేదా?

- ఏబీవీపీ నాయకురాలిపై పోలీసుల వైఖరి దారుణం
- బీజేపీ నేత ఈటల రాజేందర్


చికిత్స పొందుతున్న ఝాన్సీని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఈటల

దిల్‌సుఖ్‌నగర్: హైదరాబాద్ చుట్టుపక్కల వేల ఎకరాల భూములు అమ్ముకుంటారుగానీ హైకోర్టు నూతన భవన నిర్మాణానికి ప్రస్తుతం కేటాయించిన భూమి తప్ప ఇంకెక్కడా లేదా అని బీజేపీ రాష్ట్ర నాయకుడు, హుజూరాబాద్ మాజీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ అన్నారు. అగ్రికల్చర్ యూనివర్సిటీ భూముల రక్షణ కోసం ఆందోళన చేస్తున్న సమయంలో పోలీసుల దాడిలో గాయపడి కొత్తపేట ఓజోన్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి ఝాన్సీని శనివారం ఈటల పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వ్యవసాయ విశ్వవిద్యాలయం, వెటర్నరీ విశ్వవిద్యాలయాలకు పెద్ద ఎత్తున భూములు అవసరం ఉంటుందన్నారు. ప్రాక్టికల్‌గా నేర్చుకునే కోర్సులు ఉంటాయని అలాంటి రాజేంద్రనగర్ విశ్వవిద్యాలయ భూమిని కోర్టు నిర్మాణం కోసం కేటాయించడం సరికాదన్నారు. కోర్టులు కట్టవద్దని కాదు కోర్టుకు వ్యతిరేకంగా ఏబీవీపీ ఉద్యమాలు చేయడం లేదని అన్నారు. ఏబీవీపీ వారిపై పోలీసులు వ్యవహరించిన తీరు, ఏబీవీపీ నాయకురాలు ఝాన్సీని పోలీసులు జుత్తుపట్టుకొని లాగి కింద పడవేసిన విధానం జుగుప్సాకరంగా ఉందన్నారు. ఈ విషయంలో ప్రభుత్వం స్పందించకపోతే విద్యార్థుల ఆగ్రహానికి గురికాక తప్పదని ఈటల హెచ్చరించారు.

ఆరోగ్యంపై నిర్లక్ష్యం తగదు


వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బలాల

మలక్‌పేట: ఆరోగ్యంపై ప్రతి ఒక్కరూ ప్రత్యేక శ్రద్ధ వహిస్తామని మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల అన్నారు. శాలివాహననగర్ యూపీహెచ్‌సీ సౌజన్యంతో ఎంఐఎం ఆధ్వర్యంలో మూసారంబాగ్ డివిజన్ ఇందిరానగర్ కమ్యూనిటీహాల్లో శనివారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఉచిత వైద్య శిబిరాలు పేదలకు ఎంతో ఉపయుక్తంగా ఉంటాయన్నారు. ఆరోగ్యంపై నిర్లక్ష్యం పనికి రాదన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న వసతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రజల నుంచి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. డాక్టర్ పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు ఇచ్చారు. కార్యక్రమంలో మలక్‌పేట డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ బ్రిజున్నీసా, యూపీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ తరుణ్ శివరామ్, బోనగిరి మధు, ఎంఐఎం నాయకులు, బస్తీవాసులు పాల్గొన్నారు.

డ్రైనేజీ పైప్‌లైన్ పనులు వేగవంతం చేయండి


భరత్ నగర్ ఫేజ్-2లో డ్రైనేజ్ లైన్ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ పవన్ కుమార్

నాగోలు: కాలనీ వాసులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా డ్రైనేజీ పైప్‌లైన్ పనులు త్వరగా పూర్తయ్యేలా చూడాలని కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ అధికారులకు సూచించారు. శనివారం కొత్తపేట డివిజన్ పరిధిలోని భరత్ నగర్ కాలనీ ఫేస్-2 లో రూ. 52 లక్షలతో జరుగుతున్న నూతన డ్రైనేజ్ పైప్‌లైన్ పనులను, జలమండలి అధికారులు ఆరిఫ్, దయాకర్, కాలనీ వాసులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ పవన్‌కుమార్ మాట్లాడుతూ, భరత్ నగర్ కాలనీ ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా సరైన లెవెల్స్ చూసుకుంటూ డ్రైనేజీ లైన్ పనులు తొందరగా పూర్తయ్యేలా చూడాలని అధికారులను కోరారు. కాలనీలో ఏదైనా సమస్య వస్తే వెంటనే తన దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో కాలనీ భరత్‌నగర్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు మామిడి రామ చందర్, ఆకుల వెంకటేష్, సైదులు, రాజు, దుర్గేష్, నరసింహ, తదితరులు పాల్గొన్నారు.

బైక్‌పై స్టంట్స్ చేస్తూ.. వీడియో చిత్రీకరిస్తూ..

రోడ్డు ప్రమాదంలో రౌడీషీటర్ మృతి

- ప్రాణం తీసిన సోషల్ మీడియాలో ఫాలోవర్స్ మోజు


ఒళ్లంతా టాటూస్‌తో శ్రీకాంత్ సింగ్ (ఫైల్)

చాదర్‌ఘాట్: ద్విచక్ర వాహనంపై వెళ్తూ ప్రమాదకరమైన విన్యాసాలు చేస్తూ వాటిని చిత్రీకరించి సోషల్ మీడియాలో పెట్టి ఫాలోవర్స్‌ను పెంచుకుంటున్న ఒక రౌడీషీటర్.. అవే ఫీట్స్ చూస్తూ ప్రమాదానికి గురై మృత్యువాత పడ్డాడు. చాదర్‌ఘాట్ పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం రాత్రి ఈ ఘటన జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. కాచిగూడ నివాసి శ్రీకాంత్ సింగ్(29) టాటూస్ ఆర్టిస్ట్. ఇతనిపై సుల్తాన్‌బజార్, చైతన్యపురి, లేక్ పోలీసుస్టేషన్లలో పలు కేసులు ఉన్నాయి. కాచిగూడ పీఎస్‌లో శ్రీకాంత్ సింగ్‌పై రౌడీషీట్ ఉంది. ఇతను ఒళ్లంతా టాటూస్ వేసుకొని, రహదారులపై బైక్‌పై ఫీట్స్ చేస్తుంటాడు. వాటిని వీడియో కెమెరాతో చిత్రీకరించి సోషల్ మీడియాలో పోస్ట్ చేసి ఫాలోవర్స్‌ను పెంచుకుంటున్నాడు. ఇదే క్రమంలో శుక్రవారం రాత్రి కాచిగూడ నుంచి ద్విచక్ర వాహనంపై దిల్‌సుఖ్‌నగర్‌కు వెళ్తూ ఫీట్స్ చేస్తున్నాడు. వేగంగా వెళ్తున్న అతడి వాహనం చాదర్‌ఘాట్‌లోని సవేరా హోటల్ సమీపంలో అటుగా వెళుతున్న లారీ (ఏపీ16 టీపీ1467)ను ఢీకొంది. లారీ చక్రాల కింద పడటంతో తీవ్రగాయలై అక్కడిక్కడే మృతి చెందాడు. మృతుని వద్ద చాదర్‌ఘాట్ పోలీసులకు ఒక కత్తి, సెల్‌ఫోన్ లభించాయని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. నర్సాపురం నుండి నగరంలో మియాపూర్‌కు వెళుతున్న లారీ డ్రైవర్ శంకర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా డెక్కన్ స్ప్రింగ్స్ గ్లోబల్ స్కూల్ వార్షికోత్సవం


సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

నాగోలు: మంచి విద్య అందించాలనే దృక్పథంతో డెక్కన్ స్ప్రింగ్స్ గ్లోబల్ స్కూల్‌ను స్థాపించామని చైర్మన్ కడారి నవనీతరావు అన్నారు. శనివారం నాచారంలోని డెక్కన్ స్ప్రింగ్స్ గ్లోబల్ స్కూల్ వార్షికోత్సవాన్ని 'ఇనారా' పేరుతో నాగోలులోని శుభం కన్వెన్షన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా నవనీతరావు మాట్లాడుతూ, తమ పాఠశాల విద్యార్థులను చదువుతో పాటు అన్ని రంగాల్లో తీర్చి దిద్దుతున్నామన్నారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఇస్రో వైస్ ప్రెసిడెంట్ జీసీ కవిత హాజరయ్యారు. విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. పాఠశాల మేనేజింగ్ డైరెక్టర్ నవీన్‌కుమార్, చీఫ్ ఆఫ్ అకడమిక్స్ పవన్, సాంబ, కోర్ హెడ్ ఆపరేషన్స్ కిషోర్‌కుమార్ రెడ్డి, ప్రిన్సిపాల్ సుమ మీనన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములను కాపాడండి

- ప్రభుత్వ భూముల్లో బోర్డులు పాతాలి
- కబ్జారాయుళ్లపై కఠిన చర్యలకు డిమాండ్
- సర్పంచ్‌లను ఇన్‌చార్జీలుగా కొనసాగించాలి
- ఎమ్మెల్యే సబితారెడ్డి


సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న సబితారెడ్డి

మహేశ్వరం: మండలంలోని ఆయా గ్రామాల్లో ప్రభుత్వ భూములను కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకొని, ఆ స్థలాల్లో బోర్డులు ఏర్పాటు చేయాలని సభ్యులు డిమాండ్ చేశారు. శనివారం ఇన్‌చార్జి ఎంపీపీ కె.సునీతా అంధ్యానాయక్ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సభ్యులు ఆయా గ్రామాల్లో నెలకొన్న సమస్యలను సభ దృష్టికి తెచ్చారు. మహేశ్వరం మండలంలోని పలు గ్రామాలు, తండాల్లోని ప్రభుత్వ, పీఓటీ భూముల్లో కొందరు అక్రమార్కులు కబ్జా చేసి నిర్మాణాలు చేపట్టారని మండిపడ్డారు. ప్రభుత్వ భూములు కబ్జా చేసిన వారిపై రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకొని, ఆ భూముల్లో బోర్డులు పాతాలని ఇన్‌చార్జి ఎంపీపీ సభలో లేవనెత్తారు. ఈ విషయంపై ఎమ్మెల్యే సబితారెడ్డి స్పందిస్తూ ప్రభుత్వ భూములను కబ్జా చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకొని, ఆ స్థలాల్లో బోర్డులు పాతాలని తహసీల్దార్ మహమూద్ అలీని ఆదేశించారు. మండలంలోని పలు గ్రామాల్లోని ఇటుక బట్టీల్లో యజమానులు విద్యుత్‌ను అక్రమంగా వాడుకొని ప్రభుత్వానికి తీవ్ర నష్టం కలిగిస్తున్నారని కోళ్లపడకల్ ఎంపీటీసీ హన్మగళ్ల చంద్రయ్య సభలో పేర్కొన్నారు. ఈ విషయంపై ఏఈ మాట్లాడుతూ.. దొంగతనంగా విద్యుత్‌ను వాడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. తుమ్మలూరులో నిర్మించిన బీటీ రోడ్డు నిర్మాణం ఎత్తుగా ఉండడంతో నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని అధికారులు స్పందించి రోడ్డు నిర్మాణం ఎత్తును తగ్గించి, అసంపూర్తి పనులను పూర్తి చేసి వాడుకలోకి తీసుకురావాలని సర్పంచ్ సురేఖారెడ్డి కోరారు. రోడ్డు ఎత్తును తగ్గించి పనులు త్వరగా చేస్తామని ఆర్‌అండ్‌బీ అధికారులు తెలిపారు. పెద్ద గోల్కొండ ఔటర్‌రింగ్ రోడ్డు నుంచి మన్సాన్‌పల్లి చౌరస్తా వరకు గత రోడ్డు పనులు త్వరగా పూర్తి చేయాలని డబిల్‌గూడ సర్పంచ్ శంకర్ కోరగా నిధుల మంజూరులో కొంత ఆలస్యమైందని త్వరలో పనులు ప్రారంభించి పూర్తి చేస్తామని ఆర్ అండ్‌బీ అధికారులు తెలిపారు. మహేశ్వరం గ్రామ పంచాయతీలో చెత్త డంపింగ్‌యార్డుకు స్థలం కేటాయించాలని రెవెన్యూ అధికారులను ఎంపీటీసీ పి.సుదర్శన్ యాదవ్ సభ దృష్టికి తెచ్చారు. చెత్త డంపింగ్‌యార్డుకు స్థలం చూపించామని వాటిలో నిర్మాణం చేపట్టాలని తహసీల్దార్ వివరించారు. రైతు బంధు డబ్బులు కొంత మందికే పడ్డాయని మిగతా రైతులకు వేయాలని కోరగా .. వ్యవసాయాధికారి నాగమణి స్పందిస్తూ ఇప్పటి వరకు మూడు ఎకరాల లోపు రైతులకు మాత్రమే డబ్బులు పడ్డాయని, త్వరలో మిగతా రైతులకు వేస్తామన్నారు. తుమ్మలూరులో ప్రభుత్వ భూముల నుంచి అక్రమంగా మట్టి తవ్వకాలు చేపడుతున్నారని, వాటిని నియంతించాలని తుమ్మలూరు ఎంపీటీసీ సభ్యుడు మద్ది రామిరెడ్డి సభలో లేవనెత్తారు. ఈ విషయంపై తహసీల్దార్ మాట్లాడుతూ.. అక్రమంగా ప్రభుత్వ భూముల నుంచి మట్టి తవ్వకాలు చేపడుతే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇప్పటికే మట్టి తవ్వకాలు చేపట్టిన వారికి పెనాల్టీలు వేసి కేసులు నమోదు చేశామన్నారు.

సర్పంచ్‌లను ఇన్‌చార్జీలుగా కొనసాగించాలి: ఎమ్మెల్యే సబితారెడ్డి

గత ఐదేళ్లు సర్పంచులు బాగా పని చేశారని, ఎన్నికలు అయ్యేంతవరకు ఇన్‌చార్జి సర్పంచ్‌లుగా కొనసాగించాలని ఎమ్మెల్యే సబితారెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... పల్లె ప్రగతి ద్వారా గ్రామాల్లో జరిగిన అభివృద్ధి పనులు తరతరాలకు గుర్తుండిపోతాయన్నారు. గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన పల్లె ప్రగతి ద్వారా సత్ఫలితాలు సాధించామని , అందుకు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పాలకవర్గాలు, అధికారుల కృషి ఎంతో అభినందనీయమని ఎమ్మెల్యే కొనియాడారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీపీ కె.సునీతానాయక్, మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ పాండు యాదవ్, వైస్ చైర్మన్ వెంకటేశ్వర్‌రెడ్డి, తహసీల్దార్ మహమూద్ అలీ, ఎంపీడీఓ నర్సింహ, డీఈలు శ్రీనివాస్ రెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి, ఎంఈఓ కృష్ణ, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

రైతు బజార్లలో కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్/ వనస్థలిపురం రైతుబజార్లలో కూరగాయల ధరలు... (కిలో... రూపాయల్లో)

టమాటా 19, వంకాయ 13, బెండ 45, పచ్చిమిర్చి 45, కాకర 45, బీర 45, క్యాబేజీ 19, ఫ్రెంచిబీన్స్ 40, క్యారెట్ 19, దొండ 21–26, చిక్కుడు 28, గోకర 50, బీట్‌రూట్ 17, క్యాప్సికం 50, ఆలు 19–20, దోస 23, సొర 11, పొట్ల 15, ఉల్లిగడ్డ 20, చామగడ్డ 60. ఈ ధరలు ఆదివారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

సైదాబాద్: చెట్ల కొమ్మల తొలగింపు, వివిధ మరమ్మతు పనుల కారణంగా ఆస్మాన్‌ఘడ్ ట్రాన్స్‌కో డివిజన్ పరిధిలోని దిగువ తెలిపిన ప్రాంతాల్లో ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని అధికారులు తెలిపారు.

◆ ఉ. 10 నుంచి మ. ఒంటి గంట వరకు... శ్రీకార్ హోటల్, భోజిరెడ్డి కాలేజ్, గణేష్ టెంపుల్, వినయ్‌నగర్, పూసలబస్తీ, ఇండియన్ పెట్రోల్ పంప్ పరిసర ప్రాంతాలు.

◆ మ. 2 నుంచి సా. 5 గంటల వరకు... ఆస్మాన్‌ఘడ్, వెంకటాద్రి నగర్, గడ్డిఅన్నారం, ఆర్‌బీ కాలనీ పరిసర ప్రాంతాల్లో కరెంట్ ఉండదని అధికారులు తెలిపారు.

30న పెన్షనర్స్ అసోసియేషన్ డైరీ ఆవిష్కరణ

మలక్‌పేట: సలీంనగర్‌లోని తెలంగాణ రాష్ట్ర పెన్షనర్స్ అసోసియేషన్ నూతన సంవత్సరం 2024 డైరీని ఈనెల 30న ఆవిష్కరిస్తామని అధ్యక్షుడు మారం భరత్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి వినయ్‌కుమార్ తెలిపారు. చైతన్యపురి సాయినగర్‌లోని సీనియర్ సిటిజన్ సేవా సమితి భవన్‌లో మంగళవారం ఉదయం 11 గంటలకు తెలంగాణ జన సమితి అధ్యక్షుడు, ప్రొఫెసర్ కోదండరామ్ చేతుల మీదుగా డైరీ ఆవిష్కరణ జరుగుతుందన్నారు. పెన్షనర్స్ అందరూ సకాలంలో హాజరు కావాలని వారు కోరారు.

జాతీయ సదస్సుకు పద్మప్రియ ఎంపిక



మలక్‌పేట: ఢిల్లీలోని విశ్వ యువ కేంద్రంలో నిర్వహిస్తున్న జాతీయ సదస్సుకు మలక్‌పేట గవర్నమెంట్ నెహ్రూ మెమోరియల్ స్కూల్లో మ్యాథ్స్ టీచర్‌గా పని చేస్తున్న జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత వుమ్మాజీ పద్మప్రియ ఎంపికయ్యారు. నేషనల్ సెంటర్ ఫర్ స్కూల్ లీడర్ షిప్ ఆధ్వర్యంలో ఈనెల 29 నుంచి 31 తేదీ వరకు నేషనల్ ఎడ్యుకేషనల్ పాలసీలో భాగంగా నిర్వహించనున్న సదస్సులో పాల్గొనున్నారు. మన రాష్ట్రం నుంచి ఎంపికైన తొమ్మిది మందిలో పద్మప్రియ ఒకరు. 'లైబ్రరీ నిర్వహణ వ్యవస్థను అభివృద్ధి చేయడం' అనే అంశంపై ఆమె ప్రసంగిస్తారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీధర్, తోటి ఉపాధ్యాయులు ఆమెకు అభినందనలు తెలిపారు.

జనాభాకు అనుగుణంగా వసతులు కల్పిస్తా: ఎమ్మెల్యే

హస్తినాపురం: నియోజకవర్గంలో ఏర్పాటవుతున్న కొత్త కాలనీలు, పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ప్రజలకు మౌలిక వసతులు కల్పించేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. శనివారం హస్తినాపురం డివిజన్ అగ్రికల్చర్ కాలనీలో కాలనీ సంక్షేమ సంఘం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కార్పొరేటర్ సుజాతా నాయక్‌తో కలిసి సుధీర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, అగ్రికల్చర్ కాలనీలో ప్రజలు ఎదుర్కొంటున్న అన్ని సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకుంటామని, ఇందు కోసం అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇస్తానని అన్నారు. కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు చంద్రమోహన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి సుబ్బారావు, కోశాధికారి జితేందర్‌రెడ్డి, నాయకులు గజ్జెల మధుసూదన్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ పద్మానాయక్ సయ్యద్‌పాషా, గోదల రఘుమారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


అగ్రికల్చర్ కాలనీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ప్రజల్లో చైతన్యం తెస్తున్న 'ప్రజానాట్య మండలి'


ఎల్‌బీనగర్‌లో 'బస్సుయాత్ర'కు స్వాగతం పలికిన సామిడి శేఖర్‌రెడ్డి తదితరులు

మన్సూరాబాద్: కళాకారుల సమస్యలతో పాటు ప్రజా సమస్యల పరిష్కారానికి తెలంగాణ ప్రజానాట్యమండలి హైదరాబాద్ నుంచి హన్మకొండ వరకు చేపట్టిన కళాజాత బస్సుయాత్ర శనివారం ఎల్‌బీనగర్‌కు చేరింది. బస్సుయాత్ర రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసులు, కార్యదర్శి నర్సింహతో పాటు కళాకారులకు సీపీఐ ఎల్‌బీనగర్ నియోజకవర్గ కార్యదర్శి సామిడి శేఖర్ రెడ్డి ఘన స్వాగతం పలికారు. ఎల్‌బీనగర్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శేఖర్‌రెడ్డి మాట్లాడుతూ, ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు, ప్రజా సమస్యలపై ప్రజానాట్యమండలి కళాకారులు ప్రజల్లో చైతన్యం తెస్తూ వస్తున్నారని అన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో, సారా వ్యతిరేక ఉద్యమంలో ప్రజానాట్యమండలి చురుకైన పాత్ర పోషించిందని తెలిపారు. మలిదశ తెలంగాణ ఉద్యమం, తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావంలో కళాకారుల పాత్ర మరచిపోలేనిదని అన్నారు. ప్రభుత్వాలు కళాకారులను ఆదుకోవాలని, హెల్త్‌కార్డులు, ప్రమాద బీమా కార్డులతో పాటు డబుల్‌బెడ్‌రూం కేటాయింపుల్లో ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ప్రవీణ్‌కుమార్‌గౌడ్, బాతరాజు నర్సింహ, సుధాకర్, రమావత్ సక్రు, శ్రీదేవి, సరిత, అరుణ, పారిజాత, ఉమారాణి, అనిత, ముత్తయ్య, నాగరాజు, అనిల్, జ్యోతి, సౌజన్య, శివజ్యోతి, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీసర్వ సౌభాగ్య దేవి త్రయ యజ్ఞం


యజ్ఞ మహోత్సవంతో పాల్గొన్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి

లింగోజిగూడ: కర్మన్‌ఘాట్ శ్రీలక్ష్మి కన్వెన్షన్‌లో శ్రీ సర్వ సౌభాగ్య దేవీత్రయ గీత జ్ఞాన యజ్ఞ మహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. మహోత్సవాల్లో రెండో రోజైన శనివారం పార్వతీ పరమేశ్వరుల కల్యాణం, సహస్ర దీపోత్సవం, వేద పారాయణం, మంగళహారతి కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. నిర్వాహకులు మురుకుంట్ల రాజేశ్వర్ శర్మ, సూరిశెట్టి శివయ్య గుప్తా, శ్రీనివాస్, సురేష్, శశిధర్, రేణురెడ్డి, చెన్నారెడ్డి, గోపాల్ పాల్గొన్నారు.

జూనియర్ సివిల్ జడ్జిగా అలేఖ్య ఎంపిక



రంగారెడ్డి కోర్టులు: జిల్లా కోర్టు న్యాయవాది పరిమి అలేఖ్య ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జేసీజే నియామకాలలో న్యాయమూర్తిగా ఎంపికయ్యారు. వరంగల్ జిల్లాకు చెందిన అలేఖ్య తల్లి మాధవీలత రంగారెడ్డి జిల్లా కోర్టు 1వ సీనియర్ సివిల్ జడ్జి కాగా, తండ్రి వ్యాపారి. గురువారం ఆంధ్రప్రదేశ్ హైకోర్టు విడుదల చేసిన ఫలితాల్లో ఓపెన్ కేటగిరీలో అత్యధిక మార్కులతో అలేఖ్య న్యాయమూర్తిగా ఎంపికైనట్టు జిల్లా న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు డీకొండ రవీందర్ తెలిపాడు. 24 సంవత్సరాల ఆమె తన మొదటి ప్రయత్నంలోనే జూనియర్ సివిల్ జడ్జిగా నియామకం కావడంతో తల్లిదండ్రులతోపాటు జిల్లా న్యాయవాదుల సంఘానికి ఎంతో గర్వంగా ఉందని రవీందర్, ప్రధాన కార్యదర్శి పట్లోళ్ల మాధవ రెడ్డి అన్నారు. శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమెకు వారు అభినందనలు తెలిపారు.

దుర్గాభవానీనగర్ సంక్షేమ సంఘం నూతన కమిటీ ఎన్నిక


నూతనంగా ఎన్నికైన దుర్గాభవానీనగర్ సంక్షేమ సంఘ ప్రతినిధులు

చంపాపేట: డివిజన్ పరిధిలోని దుర్గా భవానీ నగర్ కాలనీ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కాలనీ సంక్షేమ సంఘ భవనంలో శనివారం నిర్వహించిన సమావేశంలో సంఘం అధ్యక్షుడిగా లట్టుపల్లి రమేష్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా ఆకుతోట వెంకట్, ప్రధాన కార్యదర్శిగా ఎలిమినేటి నిశికాంత్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శిగా రాజేందర్‌గౌడ్, కోశాధికారిగా నాగేశ్వరరావు, కార్యనిర్వాహక కార్యదర్శిగా పన్నాల హోమ్‌రెడ్డి, న్యాయ సలహాదారుడిగా శ్రీనివాసరెడ్డిని కాలనీవాసులు ఎన్నుకున్నారు. అనంతరం రమేష్‌రెడ్డి మాట్లాడుతూ... తన ప్యానల్‌పై నమ్మకం ఉంచి మరోమారు ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు కాలనీవాసులకు కృతజ్ఞతలు తెలిపారు. కాలనీలోని ప్రధాన సమస్యలన్నింటినీ అధికారులు, ప్రజాప్రతినిధుల సహకారంతో పరిష్కరిస్తామని కాలనీవాసులకు హామీ ఇచ్చారు.

ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి


వైద్య శిబిరంలో రోగులకు పరీక్షలు చేస్తున్న డాక్టర్ ప్రవీణ్

మలక్‌పేట: ఉచిత వైద్య శిబిరాలను పేదలు సద్వినియోగం చేసుకోవాలని శ్రేష్ఠ శ్రీ కమలా హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ప్రవీణ్ పెద్ది అన్నారు. వెల్‌నెస్ ఫ్రీడమ్ క్యాంపు పేరుతో శనివారం దిల్‌సుఖ్‌నగర్ హాస్పిటల్లో చేపట్టిన ఉచిత ఆరోగ్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం రోగులకు పరీక్షలు నిర్వహించి సలహాలు, సూచనలు చేశారు. ఈ సందర్భంగా రూ.6 వేలు విలువ గల ఫైబ్రోస్కాన్, ఈసీజీ, జీఆర్‌బీఎస్, సీబీపీ, డెంటల్ స్క్రీనింగ్ ఉచితంగా చేశారు. సుమారు 150 మంది వైద్య పరీక్షలు చేయించుకున్నారు. డాక్టర్ బాలాజీ ప్రసాద్ రాంశెట్టి, డాక్టర్ కిరణ్, డాక్టర్ కిషోర్, మార్కెటింగ్ హెచ్‌ఓడీ ఆనందబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

అనంతుల జంగారెడ్డి కాలనీ నూతన కమిటీ ఎన్నిక


నూతన అధ్యక్షుడు భాస్కర్

నాగోలు: డివిజన్ పరిధిలోని అనంతుల జంగారెడ్డి కాలనీ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షుడిగా పార్నంది భాస్కర్, కార్యదర్శిగా వై రాంరెడ్డి, ఉపాధ్యక్షుడిగా ఎం. సాయి కిరణ్, ఉప కార్యదర్శిగా నరసింగరావు, కోశాధికారిగా డి. ప్రభాకర్, కార్యవర్గ సభ్యులుగా ఎస్. వెంకన్న గౌడ్, శ్రీనివాస్ గుప్తాలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ, కాలనీలో మౌలిక వసతులు కల్పనకు నిరంతర కృషి చేస్తామన్నారు. అన్ని సదుపాయాలు కల్పించి ఆదర్శవంతమైన కాలనీగా తీర్చిదిద్దుతామని వారు అన్నారు.

శివానీ జూనియర్ కళాశాల వార్షికోత్సవం

సాక్షి,సిటీబ్యూరో: కొత్తపేట బీజేఆర్ భవన్‌లో శివానీ జూనియర్ కళాశాల వార్షికోత్సవ వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ రామ్‌రెడ్డి మాట్లాడుతూ, కళాశాలలో అనుభవజ్ఞులైన అధ్యాపకులు ఉన్నారని, నాణ్యమైన విద్యను అందిస్తున్నామని అన్నారు. దీంతో విద్యార్థులు మంచి ఫలితాలను సాధిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ బి. సుదర్శన్ రెడ్డి, డైరెక్టర్ ప్రేమ్‌నాథ్‌రెడ్డి, ప్రిన్సిపాల్ అనిత, అధ్యాపకులు పాల్గొన్నారు.

నాలుగేళ్లలో రూ.200 కోట్ల అభివృద్ధి


కేక్ కట్‌చేస్తున్న మేయర్ పారిజాత, డిప్యూటీ మేయర్ ఇబ్రాంశేఖర్

బడంగ్‌పేట్: బడంగ్‌పేట కార్పొరేషన్‌లో పాలకవర్గం ఏర్పడి నేటితో నాలుగు సంవత్సరాలు పూర్తయ్యింది. ఈ సందర్భంగా శనివారం నూతన మున్సిపల్ కార్పొరేషన్ భవనంలో పాలకవర్గం, అధికారులు కలిసి కేక్‌కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. అనంతరం మేయర్ పారిజాత మాట్లాడుతూ.. నాలుగు సంవత్సరాల్లో రూ. 200కోట్ల అభివృద్ధి పనులు జరిగాయన్నారు. ప్రస్తుత ఏడాదిలో 32 డివిజన్లను కలిపి మరింత అభివృద్ధి చేస్తామని, సమస్యలు లేని డివిజన్‌గా అన్ని డివిజన్లను తీర్చిదిద్దుతామన్నారు. సహకారం అందిస్తున్న సహ కార్పొరేటర్లకు, అధికారులకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో కమిషనర్ సుమన్‌రావు, కార్పొరేటర్లు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

యూటీఎఫ్ సమావేశాన్ని జయప్రదం చేయండి

మీర్‌పేట: చేవెళ్లలో ఆదివారం జరగనున్న యూటీఎఫ్ రంగారెడ్డి జిల్లా కమిటీ విస్తృత సమావేశాన్ని విజయవంతం చేయాలని బాలాపూర్ మండల అధ్యక్షుడు జి.శంకరయ్య, ప్రధాన కార్యదర్శి డి.ఆంజనేయులు శనివారం ఒక ప్రకటనలో కోరారు. సమావేశానికి జిల్లాలోని ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులంతా పాల్గొనాలని కోరారు.